# ఒకరికోసం ఒకరు

జ్యోత్స్న



తన్నెవరూ కట్నం తీసుకోకుండా పెళ్ళిచేసుకోలేదు కాబట్టి ఈనాటి యువతరంలో కట్నం తీసుకోకుండా పెళ్ళిళ్ళు చేసుకుంటున్న యువకులున్నారంటే, ససేమిరా వప్పుకోదు సీతామహాలక్ష్మి.

ఎప్పుడైనా, ఏదో ఓ పేపరులో ఏ అభ్యుదయ భావాలుగల యువకుడో, నిజాయితీగల ఆఫీసర్ కొడుకో, కట్నానికి గుడ్‌బై చెప్పి పెళ్ళిళ్ళు చేసుకున్నట్లు వార్తలూ, ఫోటోలూ పడితే 'లాంఛనాల రూపంలో కట్నం కొట్టేసుంటారు' అంటుంది.

సీతామహాలక్ష్మి తాహసిల్‌దారాఫీసులో హెడ్ గుమాస్తా వేణుగోపాలరావుగారి పెద్దమ్మాయి. బియ్యే పాసయింది. కాలేజీ రోజుల్లో వరకట్నానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేస్తూ కట్నం తీసుకునే వరుడ్ని పెళ్ళి చేసుకోనంది.

అప్పుడే ఆమె అభ్యుదయ భావాలకు అబ్బురపడి ఓ యిద్దరు యువకులు ముందుకొచ్చారు: ఆమెను పెళ్ళాడతామని. కానీ అప్పటికి సీతామహాలక్ష్మికి చాలా ఆశలుండేవి. కన్నెపిల్ల సహజమైన కోరికలు కూడా కొన్ని ఉండేవి. ఆ ఆశలూ, కోరికలూ తీర్చే స్థోమత ఆ యిద్దరి యువకులకూ లేదని సీతామహాలక్ష్మే వారిని తిరస్కరించింది.

ఆ తరువాతెవరూ ఆమెను పెళ్ళిచేసుకుంటానని ముందుకు రాలేదు. అందుకు కారణం ఆమె అంత అందగత్తె కాకపోవడం, కాలేజీ రోజుల్లోని తొలి యవ్వనపు ఛాయలు ఇపుడు ఆమెలో లేకపోవడం.

ఇలా అంటే సీతామహాలక్ష్మి ఒప్పుకోదు. ప్రేమకు అందం అవసరం లేదంటుంది. అందాన్ని చూసి ప్రేమించేది ప్రేమ కాదంటుంది.

బియ్యే పాసయిన తరువాత ఎమ్మే చదవాలనుకుందిగానీ ఇంట్లో పరిస్థితులనుకూలించక 'సాహిత్యం' చదవడం ప్రారంభించింది.

'మార్క్సిజాన్ని' పుస్తకాల్లోచదివేసి ఇంట్లోనే అర్థం చేసేసుకుంది.

రచయిత్రుల 'అభ్యుదయ' రచనలు చదివి అభ్యుదయ భావాల్ని అలవర్చుకుంది.

వేణుగోపాలరావుగార్కి ఇంకో అమ్మాయికూడా వుంది. పేరు సుభాషిణి.

తెల్లగా, సన్నగా, నాజూగ్గా పెరిగిన సన్నజాజి

పూలతీగెలా వుంటుంది. మొన్ననే బియ్యే పరీక్షలు వ్రాసింది.

ఆమె వేణుగోపాలరావు కూతురనే కంటే, సీతామహాలక్ష్మి చెల్లెలనడమే న్యాయం.

అక్క ప్రతిజ్ఞలకు అనువైన వరుడు దొరక లేదు కాబట్టి చెల్లెల్ని పెళ్ళిచేసే ప్రయత్నం చేస్తున్నారు వేణుగోపాలరావ్‌గారు.

సుభాషిణికి పెళ్ళిచూపులు !!

## 2

సుభాషిణి వచ్చి రామారావుకి ఎదురుగానున్న సోఫాలో కూర్చుంది.

ఆమె అద్భుత సౌందర్యానికి చకితుడై, రెప్ప వేయడం మరచి కొన్ని క్షణాలు ఆమెవైపే చూస్తూ ఉండిపోయాడు రామారావు.

"శల్య పరీక్ష చేసేస్తున్నాడు అప్పుడే!" అనుకుంది సుభాషిణి.

"సంగీతం వచ్చామ్మా ?" అడిగింది రామారావు తల్లి.

"సంగీతమూ, పాటల్తో, అమ్మాయి మంచి చెడ్డలు కొలుస్తారు కాబోలు ఈవిడగారు" అనుకుంటూ, "వీణ వాయిస్తానండీ" అంది.

"వీణలో డిప్లొమా కూడా పుచ్చుకుంది" పూర్తి వివరణ ఇచ్చారు వేణుగోపాలరావుగారు.

అమ్మాయి రూపురేఖలు రామారావు తల్లికి కూడా నచ్చాయి. ఎవ్వరూ మరేం ప్రశ్నలు వేయక పోవడంతో — కొన్ని క్షణాల అనంతరం సోఫాలోంచి లేస్తూ —

"మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి" అంది సుభాషిణి రామారావుతో.

"నేనే మిమ్మల్ని అడుగుదామనుకుంటున్నాను. ఇంతలో మీరే అన్నారు పదండి !" అంటూ ఆమెను అనుసరించాడు.

ఇద్దరూ ఎదురుగానున్న గదిలోకి నడిచారు.

ఆ గదిలో ప్రవేశించగానే పర్సనల్‌గా మాట్లాడాలని ఇంతమంది మధ్యకు తీసుకొచ్చిందేమిటా ! అని ఆశ్చర్యపోయాడు రామారావు.

ఆ గదిలో సుభాషిణితోపాటు మరో యిద్దరు అమ్మాయిలు కూడా ఉన్నారు.

గదిలో అడుగు పెట్టగానే — "నా పేరు సీతామహాలక్ష్మి, సుభాషిణికి అక్కయ్యని. ఈమె గీతారాణి. ప్రముఖ అభ్యుదయ రచయిత్రి. నా ఫ్రెండ్" అంటూ పరిచయం చేసింది.

గదిలో రౌండ్‌గా పేర్చిన కుర్చీలలో అందరూ ఆసీనులయ్యారు.

"మీ వివరాలు తెలియజేస్తారా ?" అడిగింది లక్ష్మి.

"నా పేరు రామారావు. ఈ ఊర్లోనే కాలేజీలో తెలుగు లెక్చెరర్ని" చెప్పాడు రామారావు.

"కళ్ళజోడు పెట్టుకున్నారు సైటా ?" చొరవగా అతని కళ్ళజోడు తీస్తూ అడిగింది గీతారాణి.

ఈ ప్రవర్తనకి రామారావు కొంచెం ఆశ్చర్య పడి — "అవునండి ! జీరో పాయింట్ ఫైవ్" అని చెప్పి, వీళ్ళ ఆంతర్యం ఏమిటా ? అని ఆలోచించ సాగాడు.

"ఇంకా పెరిగే అవకాశముందా ?" మళ్ళీ అడిగింది గీతారాణి.

"మీరు రాసిన 'త్రిపుర తిరగబడు' 'భానుమతీ బలికాకు!' లాంటి నవలలు చదివితే ఇంకా పెరగొచ్చండీ !"

"వాట్యూ మీన్ ?!?"

"అబ్బే ! నాకు పుస్తకాలు చదివే అలవాటెక్కువండీ ! కాబట్టి పెరగొచ్చు."

"వంట చెయ్యడం వచ్చా ?" ఈసారి సీతామహాలక్ష్మి అడిగింది.

"ఎందుకండీ ?"

"ఎందుకేమిటి ! ? ఎల్లకాలమూ మా చెల్లాయే వంట చెయ్యాలనా మీ ఉద్దేశం ? ఆర్నెల్లు ఆమె చేస్తే మిగతా ఆరు నెలలు మీరు చెయ్యాలి ! భార్యాభర్తల మధ్య సమానత్వం వుండాలి" గట్టిగా కసిరినట్టు చెప్పింది, సీతామహాలక్ష్మి.

రామారావుకి పరిస్థితి ఏమిటో, ఆ అమ్మాయిల ఆంతర్యం ఏమిటో అర్థమయింది.

రామారావులోనూ అభ్యుదయ భావాలున్నాయి. వాటిని జీవితానికి ఎలా అన్వయింపజేయాలో అతనికి తెలుసు. అతనికి జీవించడం తెలుసు. జీవితాన్ని ప్రేమించడం తెలుసు. అందుకే —

"రాదండీ !" అన్నాడు.

"అంటే, మా చెల్లాయినింక వంట గదిలో బంధిస్తారన్న మాట" అంటూ తలూపుతూ గీతారాణి వైపు చూసింది 'ఇక నువ్వు అడుగు' అన్నట్టు.

"మీది కో–ఎడ్యుకేషన్ కాలేజీయేనా ?"

"అవునండీ !"

"డ్రస్ ఇంత కొత్త డిజైన్‌లో ఇంత అల్ట్రామోడర్న్‌గా కుట్టించుకున్నారు ఏ అమ్మాయిని ఆకర్షిద్దామనీ! కొంపదీసి ఎవర్నయినా లవ్వాడేస్తున్నా రేమిటి ?" అడిగింది గీతారాణి.

"అంత పల్చటి చీరతో వంపుల్ని ప్రదర్శిస్తూ వచ్చారు, ఎంతమందిని ఆకర్షించారేమిటి ?" అనడుగుదామనుకున్నాడు కానీ వాళ్ళకీ తనకీ తేడా వుండదని, మౌనంగా చిన్న చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

సీతామహాలక్ష్మి కిందకు వంగి రామారావు ఫాంట్ కొంచెం పైకెత్తి "ఇంత బెల్ పెట్టించారు బూరాకాలు లాంటిదేమైనా..." అంటూ చూడ బోయింది.

ఈ ప్రవర్తనను సహించలేకపోయాడు రామారావు. వెంటనే కుర్చీలోంచి లేచాడు — "ఏమిటిది ?" అంటూ సుభాషిణి వైపు చూశాడు.

అక్క భావాలకు తను బానిసనన్నట్టు మౌనంగా వుందామె.

"ఏముంది ! పరీక్షించుకుంటున్నాం సార్ ! వేలకువేలు కట్నం పోసి కొనుక్కుంటున్న వస్తువు మంచిదో కాదో చూసుకోవద్దూ ? పైగా పెళ్ళి చూపుల్లో అమ్మాయిని మీ యిష్టం వచ్చిన వెధవప్రశ్నలన్నీ వేసి విసిగించగాలేనిది మిమ్మల్ని మేం అడిగితే తప్పా ? పురుషుని ఆధిక్యత ఇంకా ఎన్నాళ్ళు భరించమంటారు ? మాకూ సమాన హక్కులు కావాలి !" ఉద్రేకంతో చెప్పింది సీతామహాలక్ష్మి.

రామారావు ముఖం ఎర్రబడింది. వారి అజ్ఞానానికి నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు.

"మై డియర్ గర్ల్స్ !... ముందు మేనర్స్ నేర్చుకోండి ! తరువాత సమానత్వం గురించి మాట్లాడుదురుగాని. మై డియర్! అభ్యుదయ రచయిత్రిగారూ! మొగుడు పెళ్ళాన్ని "ఒసేవ్ !" అన్నాడని పెళ్ళాం మొగుడ్ని "ఒరేయ్ !" అనడమే సమానత్వమనీ — తను ఇల్లు అలుకుతుంది కాబట్టి, మొగుడూ ఇల్లు అలకాలనీ, తను వంట చేస్తుంది కాబట్టి మొగుడూ వంట చెయ్యాలనీ ... అదే ఇద్దరి మధ్య సమానత్వమన్న మీ భావనకి నా జోహార్లు!! ... వైవాహిక జీవితంలో ఎవరికి వారై యాంత్రికంగా, ఎవరి పనులు వారి వంతులు వారిగా చేసుకుపోవడం కంటె ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ, ఒకరి కష్టసుఖాల్లో ఒకరు పాలు పంచుకుంటూ, పరస్పర వ్యక్తిత్వపు విలువల్ని గుర్తించి ... 'ఒకరి కోసం ఒకరు'ని జీవించాలి. అంతేగాని యంత్రాల్లా పనులు పంచుకొని జీవించడం కాదు ... వైవాహిక జీవితానికీ, స్త్రీ పురుషుల కలయికకీ పరస్పర అవగాహన ముఖ్యం !! ఈ విషయాన్ని ముందు మీరు గ్రహించడానికి ప్రయత్నించండి ! తరువాత సమానత్వం అంటే ఏమిటో అర్థం చేసుకుందురుగాని" అంటూ సుభాషిణివైపు చూసి —

"సుభాషిణిగారూ ! చూడగానే మీ రూపు రేఖలు, నమ్రత నన్ను ఆకట్టుకున్నాయి. మీతో వ్యక్తిగతంగా మాట్లాడి, మీ ఆశయాలూ, అభిప్రాయాలూ తెలుసుకుని, కొన్నాళ్ళపాటు ఇద్దరం స్నేహితులుగా మాత్రం వుండి, ఒకరి గురించి ఒకరు బాగా తెలుసుకునే అవకాశం ఇచ్చి, తరువాత పెళ్ళి చేసుకోడానికి అభ్యంతరం లేకపోతే కలిసి జీవిద్దాం అనుకున్నాను — కట్నం తీసుకుంటున్నానని మీరెలా అనుకున్నారో అర్థం కావడంలేదు. నేనుగానీ, మా వాళ్ళుగానీ, ఆ విషయం మీ నాన్నగారితో ప్రస్తావించ లేదు. ఇతరుల గురించి ఆలోచించేటపుడు కాస్త సంస్కారయుతంగా ఆలోచించడం మంచిది. ఎవరి భావాలకో మీరు బానిసలు కాకుండా, కాస్త మీ సొంత బుర్రతో ఆలోచించండి ! శెలవ్ ..." అంటూ గది బయటకు నడచి —

"అమ్మా ! పదపోదాం !" అంటూ బయటకు నడిచాడు.

గదిలో ముగ్గురమ్మాయిలూ శిల్పాల్లా నిల్చుండి పోయారు.

జరిగిందేమిటో అర్థంకాక గోపాలరావుగారు, రామారావుని అతని వెంట వెళ్ళిపోతున్న అతని తల్లినీ చూస్తూ వుండిపోయారు.

## 3

మరునాడు —

సీతామహాలక్ష్మికీ, గీతారాణికీ, ఎవ్వరికీ చెప్ప కుండా రామారావుని కలుసుకోడానికి అతని కాలేజీకి వెళ్ళింది సుభాషిణి. ★